సాక్షి ఒడిశా
మంగళవారం, 18, ఫిబ్రవరి, 2025



వినతుల వెల్లువ

పర్లాకిమిడిలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు వినతులు వెల్లువెత్తాయి. అధికారులు వినతులు స్వీకరించారు. - 8లో



పాండ్రీపాణిలో భీమబొయి

పాండ్రీపాణి పంచాయతీలో భీమబొయి కార్యక్రమం నిర్వహించారు. దివ్యాంగులకు పలు సేవలు అందించారు. - 8లో



దొంగలు పడ్డారు

పర్లాకిమిడిలోని ఒకరి ఇంటిలో దొంగలు పడ్డారు. నగదు, బంగారం చోరీ చేశారు. - 8లో

న్యూస్‌రీల్

బాలింకేశ్వర మందిరంలో పూజలు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, ఆలయ కమిటీ సభ్యులు

రాయగడ: స్థానిక బాలింకేశ్వర మందిరంలో సోమవారం ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. అత్యంత పురాతనమైన ఈ మందిరాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం, దాతలు కలిసి అభివృద్ధి చేశారు. ఈ 24న పునఃప్రతిష్ఠాపనోత్సవాలు జరగనున్న నేపథ్యంలో సోమవారం ముహూర్తపు పూజలు నిర్వహించారు. తహసీల్దార్ ప్రియదర్శిని స్వయి, గంజాం పండితులు నీలమాధవ త్రిపాఠి, పట్టణ ప్రముఖులు, మందిర కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అటవీ భూమి పట్టాల పంపిణీ



వేదికపై మాట్లాడుతున్న ఫారెస్టర్ మోహన్ గోడియా


మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ సమితి కంబేడ పంచాయతీలో సోమవారం అటవీ భూమి పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. తొలిరోజు కాంబేడ, పాత చిమాటాపల్లి పోట్రేల్ పంచాయతీలకు చెందిన వారికి పట్టాలు అందజేశారు. ప్రభుత్వం తరఫున ముందుగా ఏడు గ్రామాలకు అందజేశారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్క గిరిజనుడికి పట్టాలు అందజేస్తామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ తెలిపారు. కార్యక్రమంలో కాంబేడ సర్పంచ్ రమాకాంత్ మడ్కమి, దుడుమేట్ల సర్పంచ్ ముఖుందో సోడి, పోట్రేల్ సర్పంచ్ పూజ పడియామి, ఫారెస్టర్ మోహన్ గుడియా తదితరులు పాల్గొన్నారు.

రాయగడ జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా గోపి ఆనంద్



రాయగడ: జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా న్యాయవాది గోపి ఆనంద్ నియమితులయ్యారు. మొత్తం 13 మంది ఆశావహులు తమ దరఖాస్తులను ఎన్నికల అధికారిగా వ్యవహరించిన దేవేంద్ర మహంతికి సమర్పించగా.. పార్టీ అధిష్ఠానం గోపి ఆనంద్‌కు అధ్యక్ష బాధ్యతలు అప్పగించింది. ఇటీవల 30 జిల్లాలకు గాను 23 జిల్లాల అధ్యక్షులను ప్రకటించిన అధిష్ఠానం ఏడు జిల్లాలను పెండింగ్‌లో ఉంచిన సంగతి తెలిసిందే. ఇందులో రాయగడ ఒకటి. ఎట్టకేలకు గోపి ఆనంద్‌కు పదవి వరించడంతో మద్దతుదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శబరి కల్చరల్ కౌన్సిల్ సర్వసభ్య సమావేశం



శబరి కల్చరల్ కౌన్సిల్‌లో మంత్రి నిత్యానంద గొండో, ఎమ్మెల్యేలు

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాల సంస్కృతిని పరిరక్షించేందుకు ఏర్పాటైన శబరి కల్చరల్ కౌన్సిల్ సర్వసభ్య సోమవారం సమావేశం జరిగింది. రాష్ట్ర రాజధాని భువనేశ్వర్‌లో సాహిద్ లక్ష్మణ్ నాయక్ భవన్‌లో రాష్ట్ర గిరిజన సంక్షేమ,విద్యా శాఖా మంత్రి నిత్యానంద గొండో అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అక్కడ నూతనంగా నిర్మించిన గెస్ట్ హౌస్‌ని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మజ్జి చేతుల మీదుగా ప్రారంభించాలని సమావేశం ఆమోదించింది. ముఖ్యమంత్రికి అనుకూలమైన తేదీ కోసం మాట్లాడడానికి అవిభక్త కొరాపుట్ జిల్లాలకు చెందిన ఎంపీలు,ఎంఎల్ఏలు అందరం కలసి వెళ్లి ఆహ్వానిద్దామని జయపూర్ ఎమ్మెల్యే తారా ప్రసాద్ బాహీనీపతి సూచించారు. 1970లో అవిభక్త కొరాపుట్ జిల్లాల వారి కోసం రాష్ట్ర రాజధాని లో ఈ సంస్థ ఏర్పాటైంది. సమావేశంలో ఎమ్మెల్యేలు గౌరీ శంకర్ మజ్జి (నబరంగ్‌పూర్), రఘురాం మచ్చో (కొరాపుట్), రుపుధర్ బోత్ర (కొట్ పాడ్), భ్రుగు బక్షి పాత్రో, గోదావరిష్ మహాపాత్రో, సత్య ప్రియ దాస్, మానస్ త్రిపాఠి, బంక బీహారి బిసోయి, నీలో దాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా... నిపుణ్ ఒడిశా మేళా



మల్కన్‌గిరి: ఒడిశా నిపుణ్ మేళాను ప్రారంభిస్తున్న సోమనాథ్ ప్రధాన్

మల్కన్‌గిరి: జిల్లా కేంద్రంలో గల బుటిగూఢ వీధిలో ఉన్న ఉన్నత ప్రాథమిక పాఠశాలలో సోమవారం జిల్లాస్థాయి నిపుణ్ ఒడిశా మేళా నిర్వహించారు. కార్యక్రమానికి అదనపు కలెక్టర్ సోమనాథ్ ప్రధాన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్స్‌ను ప్రారంభించారు. జిల్లాలో ఉన్న ఏడు సమితులకు చెందిన లెర్నింగ్ మెటీరియల్ సుమారు 200 స్టాళ్లు ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వెల్ఫేర్ అధికారి ఎస్.శ్రీనివాస ఆచారి, మత్తిలి సమితి విద్యాధికారి సుమిత్ విశ్వాస్, మల్కన్‌గిరి సమితి విద్యాధికారి గౌరంగ్ సాజ్జన్ పాల్గొన్నారు.

జయపురం: జయపురం సబ్‌డివిజన్ కుంద్రా సమితి కెరామటి పంచాయతీ జబాపాదర్ యూపీ స్కూల్‌లో సోమవారం నిపుణ ఒడిశా మేళా కార్యక్రమం నిర్వహించారు. అనన, కెందుగుడ ప్రాంత సాధనా కేంద్రం వారు నిర్వహించిన నిపుణ ఒడిశా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కెరామటి సర్పంచ్ మాణిక్ శాంత పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ముఖ్యవక్తగా కొరాపుట్ జిల్లా ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘ కార్యదర్శి త్రినాథ్ హరిజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మౌలిక సాక్షరత, మౌలిక సంఖ్యా జ్ఞానం, సృజనశీలతలపై స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఈ మేళాలో 450 కి పైగా విద్యా సంబంధిత సామగ్రి ప్రదర్శించారు. ప్రతి స్కూలు నుంచి ఒక ఉపాధ్యాయుడు, ఒక ఉపాధ్యాయిని పది మంది విద్యార్థులకు నిపుణ ఒడిశా మేళాపై బోధించారు. కార్యక్రమంలో గౌరవ అతిథిగా కుంద్ర సమితి ప్రాథమిక ఉపాధ్యాయుల సంఘ అధ్యక్షుడు త్రినాథ్ పండ, జబాపదర్ ఉన్నత ప్రాథమిక పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు రమేష్ గురు, సమితి ఉపాధ్యాయుల సంఘ కార్యదర్శి కె.కృష్ణ మోహనరావు, కుసుమగుడ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు నయన బిశాయి, సీఆర్‌సీసీ రఘునాథ్ సాబత్ తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సుశాంత దాస్, చక్రి పాణిగ్రాహి, సత్య రంజన్ నాయిక్, నారాయణ బరగమ్, సన్యాసీ మీనర బలియ, సరోజ్ మహాకుడ్, ఎస్.ఎమ్.సి లక్ష్మీ కుమార్ తదితరులు కార్యక్రమ నిర్వహణలో సహకరించారు.



జయపురం: నిపుణ ఒడిశా మేళా కార్యక్రమంలో అతిథులు



మల్కన్‌గిరి: వేదికపై అతిథులు



మల్కన్‌గిరి: ఒడిశా నిపుణ్ పుస్తకాన్ని ఆవిష్కరించిన అతిథులు

న్యాయహక్కులపై అవగాహన



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సమారి టంగులు ఇతర అతిథులు



వేదికపై ప్రసంగిస్తున్న అదనపు కలెక్టర్ వేద్బర్

మల్కన్‌గిరి : మల్కన్‌గిరి జిల్లా కేంద్రంలోని సాంస్కృతిక భవనంలో సోమవారం సమితి స్థాయి న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్ పర్సన్ సమారి టంగులు, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రధాన్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముందుగా జిల్లా సీనియర్ న్యాయవాది అశోక్ కుమార్ పట్నాయిక్ న్యాయ అవగాహన పై ఉపన్యాసం ఇచ్చారు. మహిళలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

గుడారి, పద్మపూర్‌లలో గంజాయి స్వాధీనం



పద్మపూర్‌లో పట్టుకున్న గంజాయి



గుడారిలో బొలేరోతో పాటు గంజాయి బస్తాలను పట్టుకున్న పోలీసులు

రాయగడ: జిల్లాలోని గుడారి, పద్మపూర్ ప్రాంతాల్లో అక్రమంగా గంజాయి తరలిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. ఆదివారం రాత్రి బొలేరొలో తరలిస్తున్నారన్న సమాచారం మేరకు గుడారి పోలీసులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 416 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు అక్రమ రవాణాకు వినియోగించిన బొలేరొను సీజ్ చేశారు. పద్మపూర్‌లో 420 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్న పోలీసులు అందుకు సంబంధించి ఒకరిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఏర్పాట్లు



అటవీ అగ్ని ప్రమాదాలపై గ్రామంలో సచేతన సభలో రేంజర్ తదితరులు

జయపురం: రానున్న వేసవిలో జయపురం అటవీ డివిజన్‌లో అగ్ని ప్రమాదాల నుంచి అడవులను సంరక్షించేందుకు, గ్రామీణ ప్రజలను చైతన్య పరిచేందుకు అటవీ విభాగ అధికారులు సచేతన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది అగ్ని ప్రమాదాలు నివారించేందుకు నూతన పద్ధతిని ప్రారంభిస్తున్నట్లు అటవీ అధికారులు వెల్లడించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాలు మానవ తప్పిదాలని జయపురం అటవీ రేంజర్ సచ్చిదానంద పొరిడ అన్నారు. ముఖ్యంగా పోడు వ్యవసాయం వల్ల ఎక్కువ నష్టం జరుగుతుందని అన్నారు. సోమవారం జయపురం సమితి మహుళభ గ్రామంలో అటవీ విభాగం నిర్వహించిన సచేతన కార్యక్రమంలో ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. అగ్ని ప్రమాదాల నుంచి అడవులను రక్షించేందుకు నూతన ప్రక్రియ ప్రారంభిస్తున్నామని వెల్లడించారు. ప్రతి సంరక్షిత, ప్రతిపాదిత సంరక్షిత, గ్రామాలకు చేరువలో ఉన్న అడవుల్లో అగ్ని నిరోధక మంచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జయపురం రేంజ్‌లో ప్రయోగాత్మకంగా ఘాట్‌ఘుమర్, పాత్రోపుట్, మహుళభట్‌లలో అగ్ని నిరోధక మంచ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అలాగే ప్రతి గ్రామంలో ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు జయపురం రేంజ్‌లో 30 మందితో రెండు టీమ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వేసవి కాలం 3 నెలలలో 10 మంది ఉద్యోగులను వి.ఎస్.ఎస్ లుగా నియమిస్తామన్నారు. ప్రతి అగ్ని నిరోదక మంచ్‌లో ముగ్గురు చొప్పున గార్డులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వారు ప్రతి క్షణం మంచ్ పరిధిలో అడవులపై దృష్టి సారిస్తారని వెల్లడించారు. ఈ మంచ్‌ల ఫలితాలు పరిగణనలోకి తీసుకుని అగ్ని నిరోధక మంచ్‌లను విస్తరింపజేయనునట్లు వెల్లడించారు.

మార్చి 10 నుంచి నీలావడి అమ్మవారి జాతర



నీలావడి అగ్నిగంగమ్మ అమ్మవారు

రాయగడ: ఆంధ్ర, ఒడిశా రాష్ట్ర ప్రజల ఇలవేల్పు నీలావడి అగ్నిగంగమ్మ అమ్మవారి జాతర మార్చి 10 నుంచి ప్రారంభం కానుంది. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను ఈ ఏడాది ఘనంగా జరిపేందుకు కమిటీ సన్నద్ధమవుతోంది. ఇటు ఆంధ్ర, అటు ఒడిశా నుండి వేల సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు వస్తారు. ఆఖరి రోజున లక్షల సంఖ్యలో అమ్మవారి ముగింపు జాతరను తిలకించేందుకు వస్తారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురు కాకుండా తగిన సౌకర్యాలు కల్పించేందుకు కమిటీ నిర్ణయించింది.

ఆటో-టిప్పర్ ఢీ



రోదిస్తున్న మృతుల కుటుంబ సభ్యులు

- ఇద్దరు దుర్మరణం
- మరికొందరికి గాయాలు



ప్రమాదానికి గురైన ఆటో, టిప్పర్

జయపురం: జయపురం సమితి టంకువ పంచాయతీ ధనముండ 326 విజయవాడ- రాంచీ జాతీయ రహదారిలో వంతెన సమీపంలో సోమవారం ఉదయం ఘోర ప్రమాదం జరిగింది. ఒక ప్రయాణికుల ఆటోను టిప్పర్ ఢీకొనడంతో ఇద్దరు మృతి చెందగా 11 మంది గాయపడ్డారు. గాయపడిన వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని అంబులెన్స్‌లో కొరాపుట్‌లోని సహిద్ లక్ష్మణ నాయిక్ ఆస్పత్రికి తరలించారు. మరో ఐదుగురిని కొరాపుట్ జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. ఆటోలో వస్తున్న వారంతా గ్రామికులు. వారు ప్రతి రోజూ బొయిపరిగుడ సమితి లెంజ గ్రామం నుంచి కూలి పనుల కోసం జయపురం వస్తుంటారు. సోమవారం కూడా అలాగే వెళ్తుండగా ప్రమాదం జరిగింది. సమాచారం అందిన వెంటనే జయపురం సదర్ పోలీసు అధికారి ఈశ్వర చంద్ర తండి పోలీసు సిబ్బందితో సంఘటనా ప్రాంతానికి చేరుకుని సహాయ కార్యక్రమాలు చేపట్టారు. ప్రమాదం జరిగిన విషయం తెలిసిన బొయిపరిగుడ సమితి లెంజ గ్రామ ప్రజలు అక్కడకు చేరుకున్నారు. ఆ ప్రాంతం అంతా ఏడుపులతో ప్రతిధ్వనించింది. ప్రమాదం కారణంగా జాతీయ రహదారిలో ట్రాఫిక్ ఆగపోయింది. పోలీసులు వచ్చి రోడ్డు క్లియర్ చేశారు.



ప్రమాద స్థలంలో గుమిగూడిన ప్రజలు



సంఘటనా ప్రాంతంలో ప్రజలను అదుపు చేస్తున్న పోలీసులు

శేష వాహనంపై స్వామి ఊరేగింపు



శేషవాహనం పై ఊరేగుతున్న స్వామివారు



ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్న దృశ్యం

రాయగడ: కొలనార సమితి అమలాభట్ట సమీపంలో గల శ్రీక్షేత్ర టౌన్‌షిప్ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనృసింహుని ఆలయ ప్రథమ వార్షికోత్సవంతో పాటు స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ప్రధాన ఘట్టమైన శేషవాహనంపై స్వామి ఊరేగింపు కనుల పండువగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు మంగనాథ్ ఆచార్యులు, ప్రముఖ వేద పండితులు భాస్కరాచార్యులు పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ముందుగా ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా రూపొందించిన శేషవాహనంపై స్వామిని ఊరేగించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

సామూహిక వివాహాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ కమిటీ వారు మందిరం ప్రాంగణంలో సామూహిక వివాహాల కార్యక్రమాలను స్వామి కల్యాణోత్సవంతో పాటు కొనసాగించారు. ఐదుగురు దంపతులకు ఉచితంగా వివాహాలు చేశారు. ఆలయ ధర్మకర్త దూడల శ్రీనివాస్ దంపతులు పాల్గొని నవవధూవరులను అభినందించారు. అనంతరం స్థానిక వేంకటేశ్వర మందిరానికి చెందిన మహిళలు విష్ణు సహస్రనామాలు పారాయణం చేశారు.



స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు

క్లుప్తంగా

పాండ్రీపాణి పంచాయతీలో భీమ బోయి కార్యక్రమం



భీమబోయి శిబిరం వద్ద దివ్యాంగుడికి వీల్‌చెైర్ అందిస్తున్న దృశ్యం

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా మల్కన్‌గిరి సమితి పాండ్రీపాణి పంచాయతీ ఎస్‌ఎస్‌డీ ప్రాథమిక విద్యాలయ ప్రాంగణంలో సోమవారం సామాజిక భద్రత, దివ్యాంగుల చైతన్యం కోసం భీమబోయి శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా మల్కన్‌గిరి సమితి అధ్యక్షుడు గౌరీ పోడియామి హాజరయ్యారు. ఈ సందర్భంగా 460 మంది దివ్యాంగుల యూడీఐడీ కార్డుల కోసం నమోదు చేసుకున్నారు. మరో 92 మంది హితాధికారులకు బస్సు పాస్, 44 మందికి డీఆర్‌ఎల్ లోన్, 133 మందికి పింఛన్లు, ఆరుగురికి వీల్‌చైర్లు, ఒక వికలాంగ జంటకు పెళ్లి కోసం రూ.2.5 లక్షలు అందజేశారు.

మహిళలకు స్వయం ఉపాధి శిక్షణ



సర్టిఫికెట్లు అంజేస్తున్న కలెక్టర్ నాయక్

రాయగడ: మునిగుడలో రామకృష్ణ మిషన్ నిర్వహిస్తున్న నైపుణ్యాభివృద్ధి కేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్రనాయక్ సోమవారం పరిశీలించారు. కుట్టుమిషన్‌లో శిక్షణ పొందుతున్న మహిళలను అభినందించారు. మహిళల ఆర్థిక సాధికారితకు శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం శిక్షణ పొందుతున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ జయరాం పంగికి పరామర్శ



జయరాం పంగిని పరామర్శిస్తున్న నాయకులు

కొరాపుట్: కొరాపుట్ మాజీ ఎంపీ, మాజీ మంత్రి జయరాం పంగిని కొరాపుట్ జిల్లా పరిషత్ అధ్యక్షురాలు సస్మితా మెలక సోమవారం పరామర్శించారు. పంగి స్వస్థలం కొరాపట్ జిల్లా పొట్టంగి సమితి కుందిలిని సందర్శించారు. పంగి కుమార్తె రాజ్యలక్ష్మి పంగి ఎముకల క్యాన్సర్ బారి పడి మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ పంగిని పరామర్శించి సానుభూతి తెలియజేశారు. పరామర్శలో మాజీ ఎంపీ జిన్ను హిక్కా, మాజీ ఎమ్మెల్యే రఘురాం పాడాల్ ఉన్నారు.

కొరాపుట్ బీజేపీ అధ్యక్షుడికి అభినందన



శివప్రసాద్ ముదలిని సత్కరిస్తున్న మహిళా నాయకురాలు పూర్ణిమ

కొరాపుట్: బీజేపీ కొరాపుట్ జిల్లా నూతన అధ్యక్షుడు శివ ప్రసాద్ ముదలికి పలువురు అభినందనలు తెలియజేశారు. సుదీర్ఘ విరామం తర్వాత పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పార్టీ నియమించింది. ఆదివాసీ నేతగా బీజేపీ వర్గాల్లో పేరున్న శివప్రసాద్‌కి తొలిసారిగా ఈ పదవి రావడం పట్ల అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. పార్టీ రాష్ట్ర అధిష్టానం ప్రకటన వెలువడిన అనంతరం సోమవారం పార్టీ నాయకులు పూర్ణిమా, గౌతం సామంత్రాయ్ తదితరులు వెళ్లి అభినందనలు తెలిపారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



నూతన కార్యవర్గం

రాయగడ: రాష్ట్ర అమలా సంఘం రాయగడ శాఖకు సంబంధించి ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఫలితాలను ప్రకటించారు. ఎన్నికల అధికారిగా వ్యవహరించిన అరుణ్ కుమార్ షడంగి ఈ మేరకు కొత్త కార్యవర్గం తుది ఫలితాలను వెల్లడించారు. సంఘం అధ్యక్షుడిగా మనోజ్ రౌత్, ఉపాధ్యక్షుడిగా నారాయణ పట్టజోషి, కార్యదర్శిగా అజయ్ నాహక్, సహ కార్యదర్శిగా బబితా పండా, కోశాధికారిగా గదాధర పాత్రోలు ఎన్నికైనట్లు ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు రెవెన్యూ విభాగానికి చెందిన 254 మంది ఈ ఎన్నికల్లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ కొత్త కార్యవర్గం మూడేళ్లపాటు కొనసాగుతుంది.

రైల్వే ప్రయాణికుల భద్రతపై అధికారుల దృష్టి

- రాయగడలో పర్యటించిన తూర్పుకోస్తా రైల్వే జీఎం



పిల్లలతో ముచ్చటిస్తున్న జీఎం ఫంక్వాల్



రాయగడ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న ఫంక్వాల్

రాయగడ: రైల్వే ప్రయాణికుల భద్రతపై సంబంధిత అధికారుల దృష్టిసారించారు. ఇందులో భాగంగా తూర్పుకోస్తా రైల్వే జనరల్ మేనేజరు పరమేశ్వర్ ఫంక్వాల్ సోమవారం రాయగడలో పర్యటించారు. ఆయన వెంట రాయగడ డీఆర్‌ఎం అమితాబ్ సింఘాల్, విశాఖపట్నం డీఆర్‌ఎం మనోజ్ కుమార్ సాహు ఇతర అధికారులు ఉన్నారు. రాయగడ-విజయనగరం రైల్ మార్గంలో మధ్య భద్రత చర్యలపై సంబంధిత శాఖ అధికారులతో జీఎం ఫంక్వాల్ చర్చించారు. రాయగడలో కొనసాగుతున్న రైల్వే డివిజన్, కొత్తగా నిర్మించిన స్టేషన్ భవనాలు తదితరమైనవి పరిశీలించారు. అనంతరం స్థానిక రైల్వే కాలనీలో పర్యటించి స్థానికులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే కాలనీలో పిల్లల వినోదం కోసం ప్రత్యేకంగా నిర్మించిన ఉద్యానవనాన్ని కూడా అధికారులు పరిశీలించారు. పిల్లలతో కాసేపు ముచ్చటించారు. కాలనీలో పరిశుభ్రత ఎల్లవేళలా పాటించాలని సూచించారు. తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రాయగడ డివిజనల్ మేనేజర్ కార్యాలయాన్ని ప్రారంభించారు.

గ్రీవెన్స్‌సెల్‌కు వినతుల వెల్లువ



వినతులు స్వీకరిస్తున్న ఏడీఎం రాజేంద్ర మింజ్



మిషన్ శక్తి స్టాల్‌ను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ అధికారి గుణనిధి నాయక్



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

పర్లాకిమిడి: గజపతి జిల్లా నువాగడ సమితి కిరమా పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు వినతులు వెల్లువెత్తాయి. అదనపు జిల్లా మేజిస్ట్రేట్ రాజేంద్ర మింజ్, ఎస్పీ జితేంద్ర కుమార్ పండా, డీఆర్‌డీఏ ముఖ్య కార్యనిర్వహణ అధికారి గుణనిధి నాయక్‌లు హాజరై 83 వినతులు స్వీకరించారు. అందులో 30 గ్రామసమస్యలు కాగా, 23 వ్యక్తిగతమైనవి. నాలుగు దరఖాస్తులను అక్కడికక్కడే పరిష్కరించారు. ఒకరికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం కిరమా పంచాయతీ కార్యాలయం ఆవరణలో మిషన్ శక్తి స్టాల్స్‌ను అధికారులు సందర్శించారు. కార్యక్రమంలో నువాగడ సమితి అధ్యక్షురాలు మాలతీ ప్రధాన్, ఐ.టి.డి.ఎ. అధికారి అంశుమాన్ మహాపాత్రో తదితరులు పాల్గొన్నారు.

రాయగడ: జిల్లాలోని మునిగుడ సమితి కార్యాలయం సమావేశం మందిరంలో సోమవారం గ్రీవెన్స్‌సెల్‌ను జిల్లా యంత్రాంగం నిర్వహించింది. జిల్లా అదనపు కలెక్టర్ నవీన్ చంద్ర నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్పీ శ్వాతి ఎస్ కుమార్, జిల్లా ముఖ్యవైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రైత్రాయ్, డీఎఫ్‌వో అన్నా సాహెబ్ ఒహోలే, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి అక్షయ కుమార్ ఖెముండి తదితరులు పాల్గొన్నారు. మునిగుడ సమితి పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 59 మంది వినతులను అందజేశారు. వీటిలో 55 వ్యక్తిగత సమస్యలు కాగా మరో నాలుగు గ్రామసమస్యలుగా గుర్తించారు. అనంతరం సమస్యల పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ నాయక్ ఆదేశించారు.

ఖాళీ కోళ్ల ఫారం దగ్ధం



మంటలు ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

రణస్థలం: మండలంలోని పాతర్లపల్లి వెంకటేశ్వర కాలనీలో ఎల్.శ్రీరాములుకు చెందిన ఖాళీ కోళ్ల ఫారం సోమవారం దగ్ధమైంది. మధ్యాహ్నం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు వ్యాపించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. రణస్థలం అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. సుమారు రూ.1.5 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు రణస్థలం అగ్నిమాపకాధికారి పైల అశోక్ తెలిపారు.

కాశీబుగ్గలో ఉద్రిక్తత



జేసీబీతో షాపును తొలగిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలోని మూడు రోడ్లు కూడలి వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న పూజా సామగ్రి షాపు తొలగింపు సోమవారం ఉద్రిక్తతకు దారితీసింది. మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు ఆధ్వర్యంలో జేసీబీతో షాపును తొలగిస్తుండగా దుకాణదారుడి కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. అధికారులతో వాగ్వాదానికి దిగడంతో తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల రంగ ప్రవేశం చేసి దుకాణదారులను అదుపుచేశారు. ఈ క్రమంలో షాపు యజమాని కళారి శ్యామ్ ఒంటిపై నూనె పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అడ్డుకుని శ్యామ్‌ను అరెస్టు చేశారు. కుటుంబ సభ్యులను కూడా పోలీసు స్టేషన్‌కు తరలించారు.

వేధింపులు తాళలేక యువకుడు ఆత్మహత్యాయత్నం

ఆమదాలవలస రూరల్: మండలంలోని శ్రీహరిపురం గ్రామానికి చెందిన పొన్నాడ సురేష్‌కుమార్ అనే యువకుడు సోమవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుడు రాగోలు జెమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని, ప్రస్తుతం పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంభ సభ్యులు చెబుతున్నారు. చిట్టీ డబ్బులు పూర్తిగా చెల్లించినప్పటికీ చిట్టీ వ్యాపారి వేధింపులకు పాల్పడటంతో తట్టుకోలేక సోమవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబ సభ్యులు ఆమదాలవలస పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ ఎస్.బాలరాజు తెలిపారు.

దొంగలుపడ్డారు..



దొంగతనానికి గురైన ఇళ్లు



ఇంటి యజమాని నర్సింగ బిశ్వాళ్ (కుక్కు)

- మూడు తులాల బంగారం, రూ.50 వేల నగదు చోరీ

పర్లాకిమిడి: స్థానిక ఎం.ఆర్.బోయ్స్ హైస్కూల్ జంక్షన్ (14 వార్డు) వద్ద నివాసం ఉంటున్న నర్సింగ బిశ్వాళ్ అలియాస్ కుక్కు ఇంటిలో దొంగలుపడ్డారు. మూడు తులాల బంగారం, రూ.50వేల నగదు దోచుకున్నట్లు ఆదర్శ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నర్సింగ బిశ్వాళ్ నాలుగు రోజులుగా ఇంటికి తాళం వేసి రూర్కెలాకు తన పిల్లలతో వెళ్లాడు. సోమవారం ఇంటికి తిరిగి వచ్చినప్పుడు తాళాలు విరిగి ఉండటంతో నర్సింగ బిశ్వాళ్‌కు అనుమానం వచ్చి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎ.ఎస్.ఐ తపన్ కుమార్ పాడి వచ్చి దొంగతనం ఎలా జరిగిందో దర్యాప్తు చేశారు. ఇంటికి వెనుకభాగం హైస్కూల్ ప్రహరి ఉండటంతో అక్కడి నుంచే తలుపులు పగలు గొట్టి దుండగులు ఇంటి లోపలికి చొరబడి బీరువా లాకర్ ఇరగ్గొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. దాచుకున్న నగదు, బంగారం పోవడంతో ఇంటి యజమాని నర్సింగ బిశ్వాళ్ కుటుంబ సభ్యులు లబోదిబోమంటున్నారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా నబకిశోర్



మాట్లాడుతున్న నబకిశోర్ శోబోరో

పర్లాకిమిడి: గజపతి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షునిగా రాయఘడ మాజీ చైర్మన్ నబకిశోర్ శోబోరో ఎన్నికైనట్టు బీజేపీ ఎన్నికల అధికారి ప్రదీప్ చంద్ర షడంగి ప్రకటించారు. ఈ సందర్భంగా పర్లాకిమిడి బీజేపీ జిల్లా కార్యాలయానికి విచ్చేసిన నూతన అధ్యక్షుడు నవకిశోర్ శోబోరోకు మాజీ అధ్యక్షుడు కోడూరు నారాయణరావు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నబకిశోర్ శోబోరో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మఝి, బరంపురం ఎంపీ ప్రదీప్ కుమార్ పాణిగ్రాహి, మాజీ ఎమ్మెల్యే కోడూరు నారాయణరావు తనపై విశ్వాసం ఉంచి పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమించారన్నారు. పంచాయతీ, జిల్లా పరిషత్ ఎన్నికల్లో మోహనా, పర్లాకిమిడి నియోజికవర్గాల్లో ఎక్కువ స్థానాలను బీజేపీ అభ్యర్థులు కైవసం చేసుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. గజపతి జిల్లాలోని మాజీ నాయకులు, యువతను కలిసి బీజేపీలో నూతన ఉత్తేజం కల్పిస్తానన్నారు. గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా పర్యటిస్తానన్నారు. బీజేపీ సాధారణ కార్యదర్శి జగన్నాథ మహాపాత్రో, తదితరులు పాల్గొన్నారు.

సారా ధ్వంసం



సీజ్ చేసిన వంట సామగ్రి, డ్రమ్ములు

జయపురం: నాటు సారా అక్రమంగా రవాణా చేస్తున్న ఒక వ్యక్తిని జయపురం అబ్కారి సిబ్బంది అరెస్టు చేశారు. అరెస్టు అయిన వ్యక్తి జయపురం సమితి పుస్పురి గ్రామానికి చెందిన కుమ హరిజన్(46) అని అబ్కారి అధికారి సుబ్రత్ కేశర హిరన్ సోమవారం వెల్లడించారు. జయపురం సదర్ పోలీసులు, అబ్కారి సెటలైట్ యూనిట్, అబ్కారి విభాగ సిబ్బంది కలిసి రూ.90 వేల విలువ చేసిన సారా ధ్వంసం చేసినట్లు తెలిపారు. సదర్ పోలీసులు, అబ్కారి సెటలైట్ యూనిట్, అబ్కారి విభాగ సిబ్బంది సంయుక్తంగా పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా జయపురం సమితి కొలాగుడ సమీప అడవిలో అక్రమంగా సారా బట్టీలు నిర్వహిస్తున్నట్లు సమాచారం అందింది. సారా బట్టీలపై దాడి చేశారు. ఆ ప్రాంతంలో 4 బట్టీల్లో 60 లీటర్ల నాటు సారా, సారా వంటకానికి సిద్ధం చేసి ఉంచిన 1300 లీటర్ల ఇప్ప ఊట ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. బట్టీల్లో సారా వంటకానికి వినియోగించే సామగ్రిని సీజ్ చేశారు. ఆ సమయంలో ఆ మార్గంలో సారా తీసుకువెళ్తున్న కుమ హరిజన్‌ను అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడిలో జయపురం అబ్కారి అధికారి సుబ్రత్ కేశర హిరన్, ఏఎస్‌ఐ బలరాం దాస్, సెటలైట్ యూనిట్ ఏఎస్‌ఐ బ్రజకిశోర్ నాయక్, సదర్ పోలీస్ స్టేషన్ ఏఎస్‌ఐ నరసింహ, ఆయా విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం



గార - చింతాడ రోడ్డు వద్ద నిరసన చేపడుతున్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు

- సమస్యలు పరిష్కరించకుంటే పోరాటం తీవ్రతరం చేస్తాం
- ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ ఆధ్వర్యంలో ధర్నా

శ్రీకాకుళం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల సమస్యలు వెంటనే పరిష్కరించాలని, లేదంటే పోరాటం తీవ్రతరం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి హెచ్చరించారు. అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యుటీ అమలు చేయాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా సోమవారం శ్రీకాకుళంలోని 80 అడుగుల రోడ్డులో ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో చేసిన అంగన్‌వాడీలు సుదీర్ఘ పోరాటం చేశారని, ఆ సమయంలో కూటమి నాయకులు హామీలు ఇచ్చారని, వారి ప్రభుత్వం ఏర్పడినా నేటికీ అమలు చేయకపోవడం అన్యాయమని మండిపడ్డారు. ధరలు విపరీతంగా పెరుగుతున్నా 2019 నుంచి జీతాలు పెరగలేదన్నారు. దీనికితోడు యాప్‌లు, నూతన విధానాలతో పని భారాలు పెంచుతున్నారని వాపోయారు. అంగన్‌వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రానున్న బడ్జెట్ సమావేశాల్లో అంగన్‌వాడీ సమస్యలపై చర్చించాలని, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, పట్టణ కన్వీనర్ ఆర్. ప్రకాష్, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు కె.జ్యోతి, జి.రాజేశ్వరి, కె.సంధ్యారాణి, అంజలీభాయ్, కృష్ణభారతి, లక్ష్మి, లక్ష్మినారాయణ, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో పట్టాభిషేకం



అనంతవర్మ చోడ గంగదేవుడి చిత్రపటాలతో ప్రదక్షిణలు చేస్తున్న నిర్వాహకులు

జలుమూరు: దక్షిణ కాశిగా పేరొందిన శ్రీముఖలింగంలో సోమవారం కళింగరాజు అనంత వర్మ చోడ గంగదేవుడి 947వ పట్టాభిషేకం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు, వారాహి అమ్మవారికి కుంకమ పూజలు నిర్వహించారు. నాటి రాజు పాలన, సైనిక శక్తి, ఆలయాల అభివృద్ధి, శ్రీముఖలింగం రాజధానిగా చేసుకొని ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల్లో నిర్మించిన ఆలయాలు, శాసనాలను ఒడిశా ప్రాజెక్టు అధికారి విష్ణు మోహన్ వివరించారు. నాటి కట్టడాలు విశిష్టతను కటక్ చాపర్ కో కన్వీనర్ దీపక్‌కుమార్ నాయక్ తెలియజేశారు. గంగదేవుడి చిత్రపటాలతో ప్రదక్షిణలు చేసి ఆలయ కార్యాలయంలో భద్రపరిచారు. కళింగ రాజ్యంతో పాటు జిల్లాలో ప్రముఖ దేవాలయాలైన శ్రీకూర్మం, అరసవల్లి, శ్రీముఖలింగం ఆలయాల అభివృద్ధికి ఇచ్చిన దానాలు, తీసుకున్న పాలనాపరమైన నిర్ణయాలను పీఏఎస్ కార్యదర్శి, కో కన్వీనర్ మురళీధర్, తరుణ్ సింగ్‌లు వివరించారు. భావితరాలకు ఆనాటి రాజుల చరిత్ర తెలియజేసేందుకు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పట్టపగలు చోరీచేసింది పక్కింటోడే..

- వీడిన శాలిహుండం చోరీ కేసు మిస్టరీ
- పండ్లవ్యాపారి ఇంట్లో 17 తులాలకు పైగా ఆభరణాలు మాయం చేసిన ఆటోడ్రైవర్ అరెస్టు



రికవరీ చేసిన బంగారు ఆభరణాలు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వివేకానంద

శ్రీకాకుళం క్రైమ్: గత నెల 22న గార మండలం శాలిహుండంలోని ఓ పండ్లవ్యాపారి ఇంట్లో పట్టపగలు జరిగిన చోరీ కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. బాధితుడి ఇంటి పక్కన నివాసముంటున్న ఆటోడ్రైవరే ఈ చోరీకి పాల్పడినట్లు నిర్ధారించి నిందితుడిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి జిల్లా పోలీసు కార్యాలయంలో డీఎస్పీ వివేకానంద సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు.

నాలుగో ప్రయత్నంలో..

శాలిహుండం గ్రామానికి చెందిన ఉర్జాన ఆదినారాయణ, రమణమ్మలు సింగుపురం కూడలి వద్ద పండ్ల వ్యాపారం చేస్తుంటారు. ఉదయం వెళ్తే రాత్రి వరకు తిరిగిరారు. గత నెల 22న ఎప్పట్లాగే ఉదయం ఏడు గంటలకు వ్యాపారానికని వెళ్లిన దంపతులు రాత్రి ఎనిమిదిన్నరకు వచ్చేసరికి వెనుక తలుపులు తీసివున్నాయి. వాస్తవానికి దంపతులే తలుపులు వేయడం మరిచారు. రమణమ్మ తాను వేసుకున్న బంగారు గాజులు, గొలుసు బీరువాలో పెట్టడానికి తాళాలు వెతకగా కనిపించకపోవడంతో షరాబుని పిలిపించి తెరిపించింది. బీరువాలో తన ఇద్దరు కుమార్తెలకు చెందిన ఆరు తులాల గొలుసు, నాలుగు తులాల హారం, రెండున్నర తులాల నక్లెస్, రెండు తులాల వొంటిపేట గొలుసు కనిపించకపోవడంతో నిర్ఘాంతపోయింది. వెంటనే గార స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో సీఐ పైడపునాయుడు, ఎస్‌ఐ జనార్దన దర్యాప్తు చేపట్టారు. స్థానికుల పనేనని గుర్తించి ఓ వ్యక్తి కదలికలపై నిఘా పెట్టారు.

అప్పులు బెడద ఎక్కువై..

రమణమ్మ పక్కింటిలో నివాసముంటున్న జోగి రాజు ఆటో డ్రైవర్‌గా పనిచేస్తూ భార్యాబిడ్డలను పోషిస్తున్నాడు. అప్పులు ఎక్కువ కావడంతో దొంగతనం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఉదయం వెళ్లి రాత్రి వరకు తిరిగి రాని రమణమ్మ ఇల్లే దొంగతనానికి సరైనదని భావించి రెండు, మూడుసార్లు ప్రయత్నించాడు. నాలుగోసారి గత నెల 22న చోరీ చేశాడు. చోరీ సొత్తును రాజు తన ఇంటి మేడపైన హోమ్ థియేటర్ స్పీకర్ బాక్సుల్లో దాచాడు. అప్పుల వారి తాకిడి ఎక్కువైపోవడంతో ఈ నెల 16న మధ్యాహ్నం 3 గంటలకు ఆరు తులాల ఆభరణాలు తనఖా పెట్టేందుకు బయల్దేరాడు. అప్పటికే రాజుపై నిఘా పెట్టిన పోలీసులు అతన్ని ఇంటివద్దే అదుపులోకి తీసుకుని విచారించగా మొత్తం విషయాన్ని బయటపెట్టాడు.

ప్రతిభకు ప్రశంసలు..

కేసును చాకచక్యంగా ఛేదించిన రూరల్ సీఐ సిహెచ్ పైడపునాయుడు, ఎస్‌ఐ జనార్దన, వన్‌టౌన్ ఎస్‌ఐ హరికృష్ణ, ఏఎస్‌ఐ శ్రీనివాసరావు, పీసీలు సూరిబాబు, జగదీష్, రమణమూర్తి, బాలకృష్ణలను ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ప్రత్యేకంగా అభినందించినట్లు డీఎస్పీ చెప్పారు. నిందితుని వద్ద మొత్తం సొత్తును రికవరీ చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

విశాఖ ఉక్కుపై బిల్లు పాస్ చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రశేఖర్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమన్న నిర్ణయం మంచిదే అయినప్పటికీ పార్లమెంట్‌లో బిల్లు పాస్ చేసి నిర్ణయం తీసుకోవాలని సమాజ వికాస సేవా సంఘం సభ్యులు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కార్యాలయంలో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశాఖలో భూకుంభ కోణాలు, స్టీల్ ప్లాంట్‌కు నాణ్యతలేని బొగ్గును సరఫరా చేసే అదానీపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల ప్రజలంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. పర్యావరణాన్ని నాశనం చేసే థర్మల్ ప్లాంట్ల ఏర్పాటు నిర్ణయాలు వెనక్కి తీసుకోవాలని కోరారు. సమావేశంలో అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్, కార్యదర్శి బొడ్డేపల్లి సత్యనారాయణ, కె.గోపాల్, ఎస్.ధనుంజయ, ఎ.సత్యన్నారాయణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జీబీఎస్‌పై అప్రమత్తం

• కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం: గులియబుల్ భారే సిండ్రోమ్ (జీబీఎస్)పై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. జీబీఎస్‌పై వైద్యశాఖ, పంచాయతీరాజ్‌శాఖలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు జీబీఎస్‌పై అవగాహన కల్పించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత ఆవశ్యకతను వివరించడంతో పాటు వేడినీరు తాగడం, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలని తెలియజేయాలన్నారు. సమావేశంలో కేఆర్ఆర్ఎస్‌డీసీ పి.ధర్మచంద్రారెడ్డి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ ప్రభాకరరావు, తదితరులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌తో ఎంఆర్ కళాశాల ఎంఓయూ



ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న వర్సిటీ, కళాశాల ప్రతినిధులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని టెక్కలి సెంచూరియన్ విశ్వ విద్యాలయం విజయనగరం మహారాజా కళాశాలతో సోమవారం ఎంఓయూ కుదుర్చుకుంది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సాంబశివరావు, వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ..నూతన జాతీయ విద్యావిధానం ప్రకారం ఇంటర్న్‌షిప్‌లు, పరిశోధన, నైపుణ్యం, తదితర అవకాశాలకు ఈ ఒప్పందం దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో డీన్లు డాక్టర్ సన్నీడయోల్, డాక్టర్ విజయ్‌బాబు, పుష్పలత, ఐక్యూసీ హెడ్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారుల సత్తా



విజేతలైన క్రీడాకారులతో ప్రజాప్రతినిధులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. ఈ నెల 11,12 తేదీల్లో విశాఖపట్నంలోని జరిగిన డీఆర్ఎం కప్ 8వ రాష్ట్ర స్థాయి ఉమెన్స్ సీనియర్ బాక్సింగ్ చాంపియన్ షిప్ 2025లో విజయనగరం క్రీడాకారులు మూడు రజత పతకాలు, మూడు కాంస్య పతకాలు గెలుపొందారు. విజేతల్లో ఎస్. షర్మిల 70 కిలోల రజత పతకం, మనోజి 75 కిలోల విభాగంలో రజత పతకం, సుమిత్ర 80 కిలోల కేటగిరిలో రజత పతకం, ఎస్.రమ్య 57 కిలోల కేటగిరిలో కాంస్య పతకం, బి.పూజిత 65 కిలో కేటగిరిలో కాంస్య పతకం, 60 కిలోల విభాగంలో వై.అనుష కాంస్య పతకం దక్కించుకున్నారు. విజేతలను స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి గజపతి రాజు అభినందించారు.

100 లీటర్ల సారా స్వాధీనం

• ఇద్దరిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న సారాను చూపుతున్న కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తదితరులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఇరిడి, పులిగూడ గ్రామాల్లో సారా అమ్మకాలపై సోమవారం నిర్వహించిన దాడుల్లో భాగంగా సారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు సారాను కలిగి ఉన్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కురుపాం ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు ఇరిడి గ్రామంలో బిడ్డిక గుండు 80 లీటర్ల సారాతో, పులిగూడ గ్రామానికి చెందిన ఊయక కిరణ్ కుమార్ 20 లీటర్ల సారాతో పట్టుబడ్డారని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల మండలాల్లో సారా తయారీ, విక్రయాలు, సరఫరా అరికట్టేందుకు దాడులు ముమ్మరంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై రాజశేఖర్, సిబ్బంది ఉన్నారు.

ఉచిత విద్యుత్ పథకానికి మంగళం

• ఒక్క ఉచిత విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వని ప్రభుత్వం
• ఉచిత విద్యుత్‌కు తూట్లు పొడుస్తున్న కూటమి



పంప్‌సెట్



వీరఘట్టం విద్యుత్ సబ్‌స్టేషన్

వీరఘట్టం:

➤ పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలం కడకెల్ల గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి రామకృష్ణ అనే రైతు ఉచిత వ్యవసాయ విద్యుత్ మీటర్ కోసం 8 నెలల క్రితం దరఖాస్తు చేశాడు. ఇంతవరకు ఆయన దరఖాస్తును పరిశీలించిన దాఖలాలు లేవు.

➤ అలాగే వీరఘట్టం గ్రామానికి చెందిన మంచుపల్లి గోపాలం అనే మరో రైతు ఉచిత వ్యవసాయ విద్యుత్ మీటర్ కోసం తన దరఖాస్తును ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నాడు. ఆ రైతుకు కూడా ఇంతవరకు విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదు. ఇలా వీరఘట్టం మండలంలో 15 మంది రైతులు ఉచిత వ్యవసాయ విద్యుత్ మీటరు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా, మరో 30 మంది వీరఘట్టం ట్రాన్స్‌కో కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేశారు. ఇలా వీరఘట్టం మండలంలో ఇంతవరకు 45 మంది వరకు రైతులు ఉచిత విద్యుత్ వ్యవసాయ మీటర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇంతవరకు ఒక్క ఉచిత విద్యుత్ వ్యవసాయ కనెక్షన్ కూడా ఇవ్వకపోవడం గమనార్హం.

➤ ఉచిత విద్యుత్ పథకానికి చంద్రబాబు ప్రభుత్వం దశల వారీగా మంగళం పాడుతోంది. రైతులకు ఆపన్న హస్తంగా మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఈ విప్లవాత్మక పథకానికి టీడీపీ కూటమి ప్రభుత్వం తూట్లు పొడుస్తోంది.అందుకోసం పక్కా పన్నాగంతో వ్యవహరిస్తోంది. కొత్తగా వ్యవసాయ కనెక్షన్లు ఇస్తే ఉచిత విద్యుత్ ఇవ్వాల్సి వస్తుంది. కాబట్టి ఏకంగా కొత్త విద్యుత్ కనెక్షన్ల మంజూరునే ప్రభుత్వం నిలిపి వేసింది. గతేడాది 2024 ఆగస్టు తర్వాత రాష్ట్రంలో కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ ఒక్కటి కూడా కూడా మంజూరు చేయలేదు. ఆగస్టు నెలాఖరు వరకు మంజూరు చేసిన కనెక్షన్లు కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆమోదించిన వాటికే కనెక్షన్లు ఇచ్చారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ఎనిమిది నెలల్లో ఒక్కటంటే ఒక్కటి కూడా కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ మంజూరు చేయలేదు.

రాష్ట్రంలో 1.50 లక్షల దరఖాస్తుల పెండింగ్..

పార్వతీపురం జిల్లాలో కొత్త వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారు. విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసి నెలలు గడుస్తున్నప్పటికీ వాటికి ప్రభుత్వం ఆమోదం తెలపడం లేదు. పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో ఇప్పటికే 2,500లకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.వాటిని పరిష్కరించి కొత్త విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్న ఆలోచన ప్రభుత్వానికి ఏ మాత్రం లేదు. కనీసం ఆ దరఖాస్తులను ఇంతవరకు పరిశీలించకపోవడం కానీ, స్క్రూటినీ చేయకపోవడం కానీ ఇందుకు నిదర్శనం. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 2,500మందికి పైగా రైతులు ఉచిత విద్యుత్ పథకాన్ని కోల్పోతున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో రైతులకు కూటమి ప్రభుత్వం ఉచిత విద్యుత్ పథకం అందనీయకుండా తీరని అన్యాయం చేస్తోంది. రాష్ట్రంలో ఉచిత విద్యుత్ కోసం సుమారు 1.50 లక్షల మంది రైతుల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.

ఏడు నెలలవుతోంది



ఏడు నెలల క్రితం వీరఘట్టం విద్యుత్ శాఖ కార్యాలయంలో ఉచిత విద్యుత్ మీటరు కోసం దరఖాస్తు చేశాను. ఇంత వరకు ఆ దరఖాస్తు ఏమైందో తెలియదు. ఉచిత విద్యుత్ కనెక్షన్ ఎప్పుడు ఇస్తారని లైన్‌మెన్‌ను అడిగితే ఎవరూ సమాధానం చెప్పడం లేదు. ఉచిత విద్యుత్ కనెక్షన్ ఎప్పుడు ఇస్తారో చెప్పాలి.

– లెంక జగదీశ్వరరావు, రైతు, నడుకూరు గ్రామం, వీరఘట్టం మండలం, పార్వతీపురం మన్యం జిల్లా

ప్రాధాన్యతా క్రమంలో మంజూరు

ఉచిత వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు గతేడాది ఆగస్టు నెలాఖరు వరకు పూర్తి చేశా. మిగిలిన దరఖాస్తులకు ప్రాధాన్యతా క్రమంలో కనెక్షన్ ఇస్తాం. కనెక్షన్ కావాల్సిన వారు 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే మా సిబ్బంది పరిశీలించి విద్యుత్ కనెక్షన్ ఇస్తారు.

– ఎస్.చలపతిరావు, ట్రాన్స్‌కో ఎస్ఈ, పార్వతీపురం మన్యం జిల్లా

ఆధునిక హంగులతో పార్వతీపురం రైల్వేస్టేషన్

• అమృత్ భారత్ పనులు పరిశీలించిన రైల్వే జీఎం



రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫంక్వాల్

పార్వతీపురంటౌన్: ఆధునిక హంగులతో పార్వతీపురం రైల్వేస్టేషన్‌ను నిర్మిస్తున్నామని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర ఫంక్వాల్ అన్నారు. ఈ మేరకు సోమవారం రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న అమృత్ భారత్ నూతన స్టేషన్ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రయాణికులకు కొద్ది రోజుల్లోనే అధునాతన రైల్వేస్టేషన్‌ను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అమృత్ భారత్ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. నూతనంగా ఎఫ్ఓబీ, టికెట్ కౌంటర్, రిజర్వేషన్ కౌంటర్, వెయింటిగ్ హాల్ పనులు జరుగుతున్నాయన్నారు. జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న స్టేషన్ ప్రయాణికులకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. స్టేషన్ అభివృద్ధికి సిబ్బంది అంకిత భావంతో పని చేస్తున్నారన్నారు. అనంతరం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశాఖ డీఆర్ఎం మనోజ్ కుమార్ సాహు, రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింగల్, సీపీఓ అంకుస్ గుప్త, సీనియర్ డీసీఎం కె సాందీప్ తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం స్టేషన్‌లో రైల్వే మేనేజర్ పరిశీలన

రైల్వేస్టేషన్ అభివృద్ధి పనుల పర్యవేక్షణ

విజయనగరం టౌన్: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ (భువనేశ్వర్) సోమవారం వార్షిక తనిఖీలు నిర్వహించారు. భువనేశ్వర్‌లో బయలుదేరిన ఆయన రాయగడ మీదుగా జిమిడిపేట, పార్వతీపురం, బొబ్బిలి, సీతానగరం మీదుగా రాత్రి 7 గంటల ప్రాంతంలో విజయనగరం రైల్వేస్టేషన్‌కు ప్రత్యేక రైల్లో చేరుకున్నారు. అడుగడుగునా ట్రాక్‌ల పరిశీలనతో పాటు మలుపులు, హెచ్చరికబోర్డులు, ట్రాక్ పాయింట్లు, ఆర్‌యూబీలు పర్యవేక్షించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు, రాజకీయనాయకులు, ప్రతినిధులు ఇచ్చిన వినతులను పరిశీలించారు. అమృత్‌భారత్ నిధుల్లో భాగంగా ప్రయాణికులకు ప్రత్యేక వసతుల కల్పనపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీ మెడికల్ రూమ్‌ను ప్రారంభించారు. అమృత్‌భారత్ స్టేషన్ అభివృద్ధిపనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఇంకా చేపట్టాల్సిన పనులపై సూచనలు చేశారు.

జర్నలిస్టు సంఘాల నిరసన

• జర్నలిస్టుపై దాడిచేసిన టీడీపీ నాయకుడిని అరెస్టు చేయాలని డిమాండ్
• జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్‌కు వినతి



కలెక్టరేట్ గాంధీ విగ్రహం ఎదుట నిరసనలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు

విజయనగరం అర్బన్: పార్వతీపురం మన్యం జిల్లా మక్కువ మండలం ప్రజాశక్తి విలేకరి మల్యాడ రామారావుపై దాడి చేసిన టీడీపీ మక్కువ మండల పార్టీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్ నాయుడిని అరెస్టు చేయాలని జర్నలిస్టుల సంఘాలు డిమాండ్ చేశాయి. జర్నలిస్టుపై చేసిన దాడికి నిరసనగా స్థానిక కలెక్టరేట్ వద్ద గల గాంధీ విగ్రహం దగ్గర సోమవారం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ విధినిర్వహణలో భాగంగా అభివృద్ధి పనుల నిర్వహణలపై వార్త కవరేజ్ కోసం విలేకరిపై దాడి చేయడం, చంపుతానని బెదిరించడం దుర్మార్గమని ఖండించారు. ఎన్నికల కోడ్ నిబంధనలను పాటించని అధికారుల పనులపై, మంత్రి కార్యక్రమాలపై ఎందుకు రాశావని అసభ్యకరమైన పదజాలంతో దూషించి భౌతిక దాడికి పాల్పడడం దారుణమని వాపోయారు. ఇకపై వార్తలు రాస్తే చంపేస్తానని బెదిరించిన వేణుగోపాల్ నాయుడిని కఠినంగా శిక్షించాలని, కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కోరారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌శివప్రసాద్, జిల్లా అధ్యక్షుడు అల్లు సూరిబాబు, ప్రధాన కార్యదర్శి ఎంఎస్ఎన్‌రాజు, ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.రమేష్‌నాయుడు, జాప్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవనాపు సత్యనారాయణ, తెలుగు జర్నలిస్టు ఫోరం అధ్యక్షుడు ఎంఎంఎల్‌నాయుడు, విజయనగరం వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.కోటేశ్వరరావు, సాక్షి టీవీ బ్యూరో అల్లు యుగంధర్, ప్రజాశక్తి ప్రతినిధి సీహెచ్.రాము, వివిధ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు డేవిడ్ రాజు, శ్రీను, రవి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఆవరణలో ఆందోళన చేస్తున్న ఏపీడబ్ల్యూజే సంఘం నాయకులు

పత్రికా స్వేచ్ఛకు విఘాతం

పార్వతీపురం: పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించడం వల్ల ప్రజాస్వామ్య మనుగడకు ముప్పు వాటిల్లే ప్రమాదముందని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించే విలేకరులపై దాడులు చేయడం సరికాదని ఏపీడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు అల్లువాడ కిశోర్ పేర్కొన్నారు. ఈ మేరకు మక్కువ మండల విలేకరిపై భౌతికదాడులకు పాల్పడడంతో పాటు చంపుతానని టీడీపీ మక్కువ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు హెచ్చరించిన చర్యను ఖండిస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. దాడులకు నిరసనగా పలు నినాదాలు చేశారు. విలేకరిపై దాడి సంఘటన ప్రజాస్వామ్యానికి గొడ్డలి పెట్టులాంటిదని పేర్కొన్నారు. తక్షణమే దాడి చేసిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని, విలేకరికి రక్షణ కల్పించాలని కోరుతూ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై విచారణ చేపట్టి అవసరమైన చర్యలు చేపడతామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఏపీడబ్ల్యూజే సంఘ సభ్యులు జిల్లా కార్యదర్శి గండి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు తోపాటు జిల్లాలోని వివిధ పత్రిలు, మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

స్త్రీ, పురుష నిష్పత్తిని తగ్గించాలి

• కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో స్త్రీ, పురుష నిష్పత్తిలో వ్యత్యాసం అధికంగా ఉంటున్నదని, దీనిని తగ్గించేందుకు గర్భస్థ శిశు లింగ నిర్ధారణ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి స్కానింగ్ కేంద్రాలపై గట్టి నిఘా ఉంచాల్సిన అవసరం ఉందని కలెక్టర్ బీఆర్. అంబేడ్కర్ అన్నారు. జిల్లాలో ఉన్న 110 స్కానింగ్ కేంద్రాల ద్వారా రోజువారీ జరుగుతున్న స్కానింగ్‌ల సమచారాన్ని సేకరించాలని సూచించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం వైద్యాధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గర్భిణులకు అవసరం ఉన్నా లేకపోయినా సిజేరియన్ చికిత్సలకు వైద్యులు సిఫార్సు చేస్తూ పేద కుటుంబాలపై అనవసర ఆర్థికభారం మోపుతున్నారని, దీనిని నివారించే దిశగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జిల్లాలో నమోదైన గర్భిణులు, వారిలో జరుగుతున్న సాధారణ ప్రసవాలు, సిజేరియన్లు ఆయా నెలల్లో జరిగే అబార్షన్లకు సంబంధించిన సమాచారాన్ని సేకరించాలని స్పష్టం చేశారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు కూడా స్కానింగ్ సెంటర్స్‌ను తనిఖీ చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ కె.రాణి, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ సుబ్రమ్మణ్యం, డెమో వి.చిన్నతల్లి తదితరులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూ జీవీలో జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం

విజయనగరం అర్బన్: జేఎన్‌టీయూ గురజాడ విజయనగరం (జీవీ)లో రెండు రోజులు నిర్వహించే జాతీయ స్థాయి సాంకేతిక సింపోజియం సదస్సు సోమవారం ప్రారంభమైంది. ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో 'ఏక్తార్ ఎక్స్‌ఎక్స్‌వీ' అనే అంశంపై నిర్వహించిన ఈ సింపోజియంను యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ డి.రాజ్యలక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశిష్ట అతిథిగా హాజరైన ఎన్ఎస్‌టీఎల్-జి రిటైర్డ్ శాస్త్రవేత్త పి.త్రిమూర్తులు మాట్లాడుతూ రోజువారీ జీవితంలో విజయానికి విద్య, వృత్తి నైపుణ్యాలు ముఖ్యమన్నారు. ఉన్నత ఉద్యోగాలకు, పదవుల ఇంటర్వ్యూలకు హాజరయ్యే విద్యార్థులు ప్రాథమిక సూత్రాలపై దృష్టి సారించడం ఎంతో అవసరమని సూచించారు. అనంతరం విశిష్ట అతిథిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ జి.జయసుమ, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఆర్.రాజేశ్వరరావు, పూర్వ విద్యార్థుల సంబంధాల డైరెక్టర్ ప్రొఫెసర్ కె.శ్రీకుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీజేనాగరాజు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ వీఎస్ వకుళ, ఫ్యాకల్టీ కో ఆర్డినేటర్లు పి.శ్రీనివాసులురెడ్డి, టి.శిరీష, వివిధ కళాశాలల నుంచి హాజరైన 400 మంది వరకు విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుబజార్‌లో నేరుగా కూరగాయల విక్రయం

• రైతులకు పిలుపునిచ్చిన అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి
• సాక్షి కథనానికి స్పందన

పార్వతీపురంటౌన్: రైతులు పండించే కూరగాయలను నేరుగా రైతుబజార్‌లో విక్రయించుకోవచ్చని అగ్రి ట్రేడ్-మార్కెటింగ్ అధికారి ఎల్.అశోక్ కుమార్ తెలిపారు. సోమవారం సాక్షిలో 'రైతులు లేరు..జని రారు' శీర్షికన ప్రచురితమైన కథనంపై ఆయన స్పంచాచారు. ఈ సందర్భంగా ఒక ప్రకటన విడుదల చేశారు. రైతుబజార్‌లో రైతులు తమ కూరగాయలను రైతులు విక్రయించవచ్చని పేర్కొన్నారు. జిల్లాలో ప్రస్తుతం కూరగాయల వంట సీజన్ అయినందున, అధిక సంఖ్యలో దిగుబడి రావడం, తమ ప్రాంతాల్లో తగినంత గిట్టుబాటు ధర రాక ఇబ్బంది పడుతున్నట్లయితే మీ పల్లె లేదా మండలాల్లోని ఉద్యానవన శాఖ అధికారులు లేదా వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులను కలిసి తగిన వివరాలు ఇస్తే, జిల్లాలోఉన్న అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ శాఖ ద్వారా మీ సరుకును పార్వతీపురంలోని రైతు బజార్‌లో నేరుగా అమ్ముకునే అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. దీనివల్ల రైతుకు ఏ విధమైన నష్టం వాటిల్లదని, కావున రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర సందేహాల నివృత్తి కోసం ఫోన్ 91823 61348 నంబర్‌ను సంప్రదించవచ్చని ప్రకటనలో వివరించారు.

గ్యాస్ సిలిండర్ లీకై అగ్నిప్రమాదం

కొత్తవలస: మండలంలోని కంటకాపల్లి గ్రామానికి చెందిన బి.మల్లయ్య ఇంట్లో సోమవారం గ్యాస్ సిలిండర్ లీకై ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇంట్లో అందరూ ఉండగానే గ్యాస్‌లీకై మంటలు రావడం గమనించి కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కలకు చెందిన యువకులు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు.ఈక్రమంలో బి.అప్పలరాజు అనే వ్యక్తి తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆ వ్యక్తిని కొత్తవలస ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారు. కాగా ఈ సమాచారం చెంతనే గల శారద మెటల్స్ అండ్ ఎల్లాయిస్ కార్మాగారం యాజమాన్యానికి అందించగా కర్మాగారానికి చెందిన ఫైర్ ఇంజిన్‌తో సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేశారు.


రెండు బైక్‌లు ఢీకొని యువకుడి మృతి

శృంగవరపుకోట: పట్టణంలోని విశాఖ-అరుకు రోడ్డులో సోమవారం మధ్యాహ్నం పుణ్యగిరి కళాశాల వద్ద బైక్ ఢీకొని ఓ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు అందించిన వివరాలిలా ఉన్నాయి. బద్దు మహేందర్ అనే యువకుడు సోమవారం మధ్యాహ్నం 1.30 సమయంలో బైక్‌పై రోడ్డు దాటుతుండగా, విశాఖపట్నానికి చెందిన బసవబోయిన దుర్గాప్రసాద్(17) అనే యువకుడు తన మోటార్ సైకిల్‌పై కొత్తూరు నుంచి ఎస్.కోట వైపు వేగంగా వస్తూ మహేందర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఇద్దరూ గాయాల పాలవగా, తలకు గాయమైన దుర్గాప్రసాద్ స్థానిక ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలి

• డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి

విజయనగరం ఫోర్ట్: గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని డీఎంహెచ్ఓ డాక్టర్ జీవనరాణి తెలిపారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో 9 పీహెచ్‌సీల వైద్యాధికారులు సిబ్బందితో సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హైరిస్క్ గర్భిణులను త్వరితగతిన గుర్తించి వారు సుఖ ప్రసవం అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బుధ, శనివారాల్లో నిర్వహించే వ్యాక్సినేషన్‌ను లబ్ధిదారులందరికీ వేసేలా చూడాలని చెప్పారు. టీబీ గురించి ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. ఒళ్లంతా తిమ్మిర్లుగా అనిపించడం, కండరాలు బలహీనంగా మారడం, డయేరియా, పొత్తి కడుపు నొప్పి, జ్వరంతో పాటు వాంతులు గులియన్ బారే సిండ్రోమ్ లక్షణాలని తెలిపారు. ఈ వ్యాధి పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్నారు. నాడీ వ్యవస్థను ఈవైరస్ దెబ్బతీస్తుందని తెలిపారు. దీంతో రోగి పక్షవాతం బారిన పడతారన్నారు. ఇది అంత ప్రమాదకరం కాదని, దీని గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. డీఎల్ఓ డాక్టర్ కె.రాణి, డీఐఓ డాక్టర్ అచ్యుత కుమారి, ఎన్‌సీడీ పీఓ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డెమో వి.చిన్నతల్లి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ జీవన రాణి







ఎండలోబడి..

రథసప్తమి వెళ్లాక.. ఎండలు మండుతున్నాయి.. రెండు నిమిషాలు బయట ఉంటేనే.. నెత్తిన అగ్నిగోళం పెట్టుకుని తిరుగుతున్నట్లు అనిపిస్తోంది. కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. పెద్దవారే ఎండల ధాటికి బెంబేలెత్తిపోతున్నారు. అలాంటిది చిన్న పిల్లలు.. విద్యార్థులు.. ఏకధాటిగా కూర్చొన్న చోట నిలువ నీడ లేక.. ఉదయం నుంచి సాయంత్రం వరకూ పందిర నీడన ఒకేచోట ఉండాలంటే సాధ్యమేనా? రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి సొంత నియోజకవర్గం సాలూరులోనే విద్యార్థులకు ఈ దుస్థితి ఎదురుకావడం గమనార్హం. సాలూరు మండలం తోనాం పంచాయతీ మెట్టవలస గ్రామంలో గతంలో ఆర్సీఎం పాఠశాల ఉండేది. అది ఒక పాత భవనంలో నడిచేది. రెండేళ్ల కిందట అది కూలిపోవడంతో దానిని ఎంపీపీ స్కూల్‌గా మార్చారు. తర్వాత కొన్నాళ్లపాటు తాత్కాలికంగా జీసీసీ భవనంలో పాఠశాలను నడిపించారు. అనంతరం ఆ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావడంతో అక్కడ ఖాళీ చేయించారు. ప్రస్తుతం పిల్లలకు పాఠాలు ఒక చెట్టు కింద, పందిరిలో బోధించాల్సిన పరిస్థితి నెలకొంది. పిల్లలకు సరైన సదుపాయాలు లేక ఎండలో ఇబ్బందులు పడుతున్నారు. పాఠశాల గురించి ప్రస్తుత గిరిజన శాఖ మంత్రికి విన్నవించినా స్పందన శూన్యం. ప్రస్తుతం ఊరిలో 52 మందికి పైగా పిల్లలు ఊరి చివరన గ్రామస్తులు, ఉపాధ్యాయులు కలిసి ఏర్పాటుచేసిన పందిరి నీడలోనే చదువుకుంటున్నారు. ఇంకొందరు ఇతర పాఠశాలలకు వెళ్తున్నారు. అసలే ఎండలు. ఆపై ఆరుబయట చదువులతో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. కనీసం ఒక షెల్టర్ అయినా ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నారు. పిల్లల చదువు కష్టాలకు ఈ చిత్రాలే సాక్ష్యం.

– సాక్షి, పార్వతీపురం మన్యం